# 17. శాపోపహతులు

డిసెంబరు నెల మొదటివారం.

చిన్న చలిగాలివీస్తున్నది.

పార్కులో బెంచీమీద కూర్చున్న అతనిపై సాయంకాలపుటెండపడుతోంది.

ఇవాళ ఆరోతారీకు.

కిందటి సంవత్సరం ఇదే రోజున అతను ఈ సిమెంటు బెంచీమీదనే కూర్చున్నాడు.

బొంబాయి నుంచి వచ్చిన తరువాత హొటలులో రెండురోజులుండి, పట్టణం చివరను, కొండలవేపు చిన్న బంగళా అద్దెకు తీసుకున్నాడు.

ఆ బంగళా ఇప్పటికీ రోడ్డు అవతలి పక్క ఉంది. అందులో ఎవరూ ఉన్నట్లు లేరు.

తను ఆ బంగళాలో ఉన్నప్పుడు, ముందు మంచిలాను, ఒకవేపు బంతి మొక్కలు, మరోవేపు చేమంతి మొక్కలు ఉండేవి. వాటినిండా పూలే.

నిర్మలకు పువ్వులంటే ప్రాణం. క్రిందటి సంవత్సరం తనతోపాటు ఆమె కూడా పార్కుకి వచ్చింది. బంగళాలో ఒక్కర్తె కూర్చొని ఏమిటి చేస్తుంది?

వాళ్లిద్దరు లానులో గార్డెన్ చెయిర్సు వేసుకొని కొంచెంసేపు కూర్చున్నారు. కాని, బంగళా నీడలో చలిగాలి విహారం చేస్తుంటే, మెల్లిగా నడుస్తూ పార్కువేపు వచ్చారు.

రోడ్డుకు అభిముఖంగా సిమెంటు బెంచీలున్నాయి. వాటిపైకి సాయంకాలపు టెండపడుతూఉంటే, ఇద్దరూ గేటు తెరచుకొని లోపలికి వచ్చారు. అతను బెంబీ మీద నడిచి పాటిని పరికిస్తూనిలుచుంది.

మరొక్క పావుగంటలో పట్నం నుంచి, వయసు మళ్లిన ఒకాయన పార్కు గేటు తెరచుకొనిలోపలికి వచ్చాడు. ఆయన పంచకట్టుకున్నాడు. కల్లీలాల్చీ తొడుక్కున్నాడు, భుజాలమీద ఊలుమఫ్లరువేసుకున్నాడు.

వచ్చిన ఆయన బెంచీవేపు నడిచి, అక్కడ కూర్చున్న అతనికి నమస్కారం చేసి అన్నాడు.

'మీరు కొత్తవాళ్లవలె కనిపిస్తున్నారు. నా పేరు కేశవరావు. ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో కనిపిస్తున్న నీలం రంగు మేడ మాదే. సాయంకాలం షికారుకని పార్కుకు వస్తూ ఉంటాను.'

'నమస్కారాలు. నా పేరు నారాయణరావు. నేను బొంబాయి నుంచి నాలుగు రోజులై వచ్చాను. అదిగో చేమంతి మొక్కల దగ్గిర నిలబడ్డది మా అమ్మాయి, నిర్మల. ఆమె ఈ మధ్య జబ్బు పడింది. ఈ పట్టణం ఆరోగ్య కేంద్రమని ఇక్కడికి వచ్చాము. ఎదురుగుండా బంగళా అద్దెకు తీసుకున్నాను.

'చాల బాగుంది. ఈ పట్టణంలో నాలుగునెలలుంటే చాలు...'

పెద్దాయన మాటలు పూర్తికాకుండానే, మోటారు సైకిలొకటి రోడ్డుమీద కొంచెం ముందుకు పోయి ఆగింది. వెనుకకు కూర్చున్న యువకుడు కిందికి అమ్మాయిని దీక్షగా చూసి, ముందున్న యువకుడితో ఏదో అన్నట్లున్నాడు. ఇద్దరూ ఒక అయిదునిమిషాలు అమ్మాయిని చూసి కొండలవేపు పోతున్న రోడ్డుమీద తిన్నగా వెళ్లిపోయారు.

నారయణరావు, కేశవరావు కొంచెంసేపు మౌనంగా ఉండిపోయారు.

'ఎవరీ కుర్రాళ్లు?' నారాయణరావు అడిగాడు.

'పోకిరీ అబ్బాయిలు.' అన్నాడు కేశవరావు.

ఇంతలో నిర్మల రెండు చేమంతి పూలు కోసితెచ్చి తండ్రికి చూపించింది.

'డాడీ! ఎంత చక్కగా ఉన్నాయో, ఈ ఊదారంగు చేమంతులు! మన బంగళాలో అన్నీ తెల్లవే' అంది నిర్మల.

'మావూళ్లో నర్సరీ ఒకటుంది. అన్ని రంగుల చేమంతులు దొరుకుతాయి' అన్నాడు పెద్దాయన.

'రేపు మాలీని పంపించి తెప్పిస్తాను' అన్నాడు నారాయణరావు.

'మీరు వచ్చి వారం రోజులు కూడాకాలేదు. అప్పుడే మాలీ కూడా దొరికాడా?' కేశవరావు అడిగాడు.

'మేము బంగళాలో దిగిన రెండో రోజే, ఈ పార్కులో పనిచేసే మాలీ వచ్చి, తన కొడుకు మొక్కల సంరక్షణ బాగా చేస్తాడని అంటే వాడిని మాలీగా పెట్టుకున్నాం.'

నిర్మల జీన్సు తొడుక్కుంది. టీషర్టులోనికి టక్ చేసుకొంది. వెడల్పైన బకిల్ బెల్టు నీరెండలో మెరుస్తున్నది. ఆమె తొడుక్కున్న ఎత్తు మడమలజోడు శరీరంలో కొత్త వంపులు సృష్టిస్తున్నది.

పెద్దాయన ఆమె వేపు కొంచెంసేపు చూసి, లేచి నిలబడ్డారు.

'ఏం వెళ్లిపోతున్నారు.' అడిగాడు నారాయణరావు.

'పట్నంలో కొంచెంపనుంది. ఇంకా చీకటి పడితే నాకు యిబ్బంది అవుతుంది.' అన్నాడు కేశవరావు గేటు వేపునడుస్తూ.

ఆ విధంగా వాళ్లిద్దరికీ స్నేహం కలిసింది.

రోజూ సాయంకాలం అయిదు గంటలకు ముందే అతను కూతురితో సహా పార్కుకు వెళ్లేవాడు. మరో పది నిమిషాలలో కేశవరావు వచ్చేవాడు. ఇద్దరూ ఆ రోజు వార్తల గురించి, లోకం గురించి మాట్లాడుకునేవాళ్లు.

సాయంకాలం అయిదున్నర అయేసరికి మోటారు సైకిలుమీద విధిగా యిద్దరు

యువకులు, ఊరివేపు నుండి కొండలవేపున్న ఫారమ్ హౌసులకు వెళ్తూ, పార్కు గేటుకి సమీపంగా ఒక్క పదినిమిషాలు ఆగి, మాట్లాడుకుంటూ, చూపులతో నిర్మల సౌందర్యాన్ని తాగి మరీ వెళ్లేవారు.

ఒకరోజు వాళ్లలో ఒకడు ఈలకొట్టి, వేళ్లతో పెదవులు తాకి ముద్దొకటి నిర్మలమీదికి విసిరాడు.

నారాయణరావు మాటలేకుండా ఉండిపోయిడు.

కేశవరావు మాత్రం ఊరుకోలేకపోయాడు.

'అరే బద్మాష్!' అతను గట్టిగానే అరిచాడు.

ఆ సరికే వాళ్లు మోటారు సైకిలు స్టార్ట్ చేసి కొండవేపు పరుగెత్తించారు.

'ఈ కుర్రాళ్లెవరివాళ్లు?' కొంచెం సేపటి తరువాత నారాయణరావు అడిగాడు.

'ఇంకెవరు? ధనమదంతో మస్తెక్కినవాళ్లు – రౌడీలు.'

'చదువుకున్న కుర్రాళ్లే ఇలా ప్రవర్తిస్తే...'

'వీళ్లకి చదువేమిటయ్యా బాబూ! పట్టుమని పదోక్లాసు కూడా వీళ్లలో ఎవడూ పాసుకాలేదు.'

అక్కడితో సంభాషణ ఆగిపోయింది. చలిగాలి కొండలమీంచి వీస్తుంటే ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

నారాయణరావు, నిర్మల సాధ్యమైనంతవరకూ సాయంకాలాలలో పార్కుకు వెళ్లడం మానివేశారు. ఒకవేళ వెళ్లినా తొందరగా తిరిగివచ్చేవారు.

ఉదయం పూటలలో మాలీ కొడుకు మొక్కలకు నీళ్లు పెడుతుంటే వెచ్చటి ఎండలో నిర్మల బంగళా ముందున్న ఆవరణలో నిలబడి చూస్తూఉండేది. ఒకరోజు మోటారు సైకిలు మీద ఇద్దరు యువకులు వచ్చి, గేటు దగ్గిర నిలబడి మాలీకొడుకును పిలుస్తుంటే, ఆమె తొందరగా యింట్లోకి వెళ్లిపోయింది.

అటు తరువాత ఆమె బయటికిరాలేదు.

ఆరునెలలో, సంవత్సరమో ఆ ఆరోగ్య కేంద్రంలో ఉండాలని వచ్చిన నారాయణరావు మూడు నెలలకే కూతురితో కూడా ఊరువిడిచి వెళ్లిపోయాడు.

మళ్లా తొమ్మిదినెలల తరువాత అతను ఒంటరిగ తిరిగి ఆవూరు వచ్చాడు.

ఎవరో కుర్రాళ్లకి ఒక ముఖ్యవిషయం చెప్పి వెళ్లి పోదామనుకున్నాడు.

ఒకవారం రోజులు నారాయణరావు, సాయంకాల వేళల్లో, పార్కులో సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. మోటారు సైకిళ్లమీద ఏ కుర్రాళ్లు వెళ్లలేదు. ముసిలాయన కేశవరావు కూడా షికారుకు రాలేదు. రాత్రి చీకటి పడేదాకా పార్కులో కూర్చొని ఎవరూ కనపడకపోతే,

మైలుదూరమున్న హోటలుకి తిరిగి వెళ్లి పోతున్నాడు.

మరునాటి నుంచి అతను పద్ధతి మార్చేశాడు. ఉదయం తొమ్మిది గంటలకే వచ్చి పార్కులో కూర్చున్నాడు. చలిగాలి వీస్తున్నది. క్రమంగ ఎండ వచ్చింది. కాని సిమెంటు బెంచీల మీదికి ఎండరాలేదు.

నిర్వ్యాపారం అతనలా పదిగంటల వరకు అక్కడేకూర్చున్నాడు. కొంచెం చలి తగ్గింది. ఎవరూ రావడంలేదని అతను లేచిపోబోతూ ఉంటే, పార్కుగేటు దగ్గిర మోటారు సైకిలు ఆగింద. అది పట్టణం నుండి రావడం లేదు. కొండవేపు నుండి పట్టణానికి వెళ్తున్నది.

మోటారు సైకిలు వెనుకను కూర్చున్న వ్యక్తి దిగిపోయాడు.

'శంకర్! వెనుకను కూడా నువ్వు కూర్చోలేకపోతున్నావు. పడిపోతే చికాకు. నీపరిస్థితి డాక్టరుకు చెప్పిమందుతెస్తాను. అన్నాడు మోటారు సైకిలు నడుపుతున్న కుర్రాడు.

అతని మనసులో 'శంకర్' అన్న పేరు వేయి జ్ఞాపకలను బయటపెట్టింది....ః

నిస్సహాయంగా మంచం మీద పడిఉన్న నిర్మలను అతను తరచి తరచి అడుగుతున్నాడు. 'ఎవరీ దుర్మార్గానికి పాలయినవాళ్లు?' ఆమె జవాబు చెప్పలేదు. చాలసార్లు ఆమెను ప్రశ్నించాడు. చివరకామె మూలుగుతూ 'శంకర్‌లో కలిపి నలుగురు.' అంది.

వాడేనా వీడు?

పొడవుగా, బలిష్టంగా కనిపిస్తున్న కుర్రాడు – కుర్రాడేమిటి, ఇరవైయ్యేళ్లకు పైబడిన యువకుడు. జాపోస్తూ నీరసంగా వచ్చి అతనికి కొద్దిదూరంలో బెంచీమీద కూర్చున్నాడు.

వారంరోజుల నుండి ఎవరెవరో వ్యక్తుల గురించి అతను ఎదురుచూస్తున్నాడు. ఇవాళ వాళ్లలో ఒకడు కనిపించాడు. బహుశాముఖ్యమైనవాడు – వీడితో చెప్తే చాలు. అందరిని కలియనక్కరలేదు.

అతను, వచ్చిన యువకుడి వేపు జరిగి అన్నాడు.

'ఏంబాబూ! ఒంట్లో బాగులేదా?'

దానికి జవాబు రాలేదు.

రెండోసారికూడా అతను అదే ప్రశ్న వేశాడు.

'కనపడడంలేదా, నీకు?' ఆ మనిషి విసుక్కుంటూ అన్నాడు.

'అవునవును. చాల నీరసంగా కనిపిస్తున్నవు. అలా ఊరివేపు వెళ్లి టీకాని, కాఫీకాని తెచ్చేదా?'

అక్కరలేదన్నట్లు ఆ కుర్రాడు తల ఆడించాడు.

'పోనీ, మంచి నీళ్లేనా ఇచ్చేదా?'

దానికా యువకుడు కాదనలేదు.

తనతో తెచ్చుకున్న వాటర్‌బాటిల్‌లోని నీళ్లు కప్పులోపోసి శంకర్‌కియిచ్చాడు. ఆ కుర్రాడు మరోకప్పుడు నీళ్లుకూడా పోయించుకొని తాగాడు. కొంచెం సేదదీరినట్లు కనపించాడు.

'నీ పేరేమిటి?' అతనడిగాడు.

ఆ శంకర్ జవాబివ్వలేదు.

'పోనీలే - నా పేరు నారాయణరావు'

ఆ కుర్రాడు ఎటువంటి ప్రశ్న వెయ్యలేదు.

'నేను బొంబాయిలో పెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరక్టరుగ పనిచేసేవాడిని. మలబారుహిల్సులో నాకొక స్వంతఫ్లాటు ఉండేది.'

ఆ యువకుడు వినడానికి సుముఖుడుగా ఉన్నట్లు కనిపించదు.

'నా సంసారం చిన్నదే - ఒక్క కూతురు మాత్రమే మా దంపతులకు కలిగింది. అన్ని విధాల మేము సుఖంగా కాలంగడిపే వాళ్లం. అమ్మాయి కాలేజీలో చదువుతుండేది.

అతను ఒక్కక్షణం ఊరుకున్నాడు. యువకుడి ముఖంలో వినడానికి ఉత్సాహం కనిపించింది.

'కాలేజీకి సెలవు ఇచ్చారు. మేము ముగ్గురం ఒక రోజు కారులో బయలుదేరి విదేశాల నుండి వస్తున్న స్నేహితుడిని రిసీవు చేసుకోడానికి విమానాశ్రయం వేపు వెళ్తున్నాము. అకస్మాత్తుగా ఒకలారీ అదుపు తప్పి మా కారును గుద్దింది. ఆ ప్రమాదంలో నాభార్య అక్కడికక్కడే చనిపోయింది. మా అమ్మాయికి బలమైన గాయాలు తగిలి, స్పృహకోలుపోతే నర్సింగ్ హూములో చేర్చాను. ఆమె బతుకుతుందని అనుకోలేదు.'

యువకుడు సావధానంగా వింటున్నాడు.

'అమ్మాయిని ఆరునెలలు నర్సింగ్ హెూములో ఉంచాను. అయిదుసార్లు నెత్తు రెక్కించారు. నలుగురు స్పెషలిస్టులు ఆమెకు చికిత్స చేశారు. మొత్తానికి ఆమె బతుకుదారిలో పడింది.'

'ఊహూ!' ఆ కుర్రాడు అన్నాడు.

'మరి చెయ్యడానికి వైద్యంలేదని, ఎక్కడేనా ఆరోగ్య కేంద్రానికి తీసుకుపోయి నాలుగయిదు నెలలుంటే ఆమె మామూలు స్థితికి చేరుకుంటుందని డాక్టర్లు చెప్పారు.

'దగ్గిరలో ఉన్నమంచి ఆరోగ్యకేంద్రమని, ఈ వూరికి కిందటి నెల డిసెంబరు నెల మొదటివారంలో వచ్చాము. వచ్చిన రెండు రోజులలోనే ఒక బంగళా దొరికింది. అదేదోకాదు, ఎదురుగా కనిపిస్తున్నదే!'

ఆ యువకుడు వింటున్నాడోలేదో, కళ్లు మూసుకున్నాడు. బంగళావేపు చూసినట్లు లేదు.

'మా అమ్మాయి చాలఅందమైనది. గుణవంతురాలు. ఆమె ఆరోగ్యం కుదుటబడితే తిరిగి కాలేజీలో చేర్పించాలనుకున్నాను. ఆమె కోసం ఏ త్యాగమైన చెయ్యడానికి సిద్ధపడ్డాను.'

యువకుడి స్థితిలో మార్పు కనిపించలేదు.

'బంగళాలో దిగిన రెండు నెలల వరకు, ఏదోచిన్న సంఘటనలు తప్ప కాలం బాగానే గడిచింది.'

అతను కొంచెం సేపు సంభాషణ ఆపాడు.

'నీకు వినడానికి బోరుకొట్టడం లేదుకదా?'

కళ్లు మూసుకునే ఆ అబ్బాయి తల ఊపాడు.

'అమ్మాయికి జ్వరం వస్తుంటే, ఊళ్లో లేడి డాక్టరుకి చూపించాను. ఆమె పరీక్ష చేసి ఏవో మందులు వ్రాసింది. నెత్తురు తీసి బొంబాయి పంపింది.

ఒక్క క్షణం ఆలోచించి అతను చెప్పడం సాగించాడు.

'వారం రోజుల తరువాత బ్లడ్ రిపోర్టు తెద్దామని పట్టణానికి పోయాను. వెళ్లేముందు తోటమాలితో చెప్పి మరీ వెళ్లాను. లేడీ డాక్టరు పురిటికేసులో ఆపరేషను థియేటరులో ఉండడంచేత నాకు రిపోర్టు దొరికేసరికి మధ్యాహ్నం మూడుగంటలయింది.'

అతను చెప్పడం ఆపాడు. వాటర్ బాటిల్లో మిగిలిన కొద్దిపాటి నీళ్లు తాగాడు.

యువకుడు కూడా తెలివిగా కూర్చున్నాడు.

'నేను బంగళాకి తిరిగివచ్చేసరికి గేటు తలుపులు బార్లా తీసిఉన్నాయి. మేకలు ఆవరణలోకి చొరబడి పూల మొక్కలను తినేస్తున్నాయి. వాటిని బయటికి తోలివేసి, గేటు తలుపులు వేసి వీధి తలుపులు కొట్టబోయి ఆగిపోయాను. తలుపువేసిలేదు. గాలికి కొంచెం వెనుకకుపోయింది. అరుస్తూ లోపలికి పరుగెత్తాను. పడకగదిలో మా అమ్మాయి పడిఉంది. ఎంతపిలిచినా మూలుగు తప్ప ఆమె జవాబు చెప్పలేదు.'

ఆ కుర్రాడు చాల శ్రద్ధతో వింటున్నాడు.

'చాలా ఉపచారాలు చేసిన తరువాత రాత్రికి ఆమెకు తెలివివచ్చింది. సంగతి తెలిసి తలకొట్టుకొని ఏడ్చాను. ఎవరితో చెప్పుకోవడం? పోలీసు రిపోర్టుయిస్తే నలుగురికి విషయం తెలుస్తుంది. ఎవ్వరితో చెప్పకుండా మర్నాడు టాక్సీ చేయించుకొని బొంబాయి వచ్చాము.'

పక్కనున్న యువకుడు స్థాణువులె కూర్చున్నాడు.

'ఒక నర్సింగ్ హోమ్‌లో వారం రోజులు తరువాత, బాధతోను అవమానంతోను ఆమె చనిపోయింది.'

శంకర్ అన్న యువకుడు దీర్ఘంగా నిట్టూర్చి, సావకాశంగా కూర్చొని తనంతట తానుగా మాట్లాడాడు.

'తరువాత ఏమయింది?'

'నాకు జీవితం మీద విరక్తి కలిగింది. ఉద్యోగానికి రాజీనామా చేశాను. మలబారు హిల్సులోని ఫ్లాట్ అమ్మివేశాను. ఒక నెల్లాళ్లపాటు హోటలు గదులలో ఉన్నాను. పూనాలో, ధనికులైన ఒంటరివాళ్లకి అన్ని సదుపాయాలు సమకూర్చే ఒక హోమ్‌ఉంటే, అందులో చేరిపోయాను.'

'చాల బాగుంది.' అన్నాడు శంకర్.

'నాకు జీవితం మీద విరక్తి తగ్గి, బతికుండే మిగిలిన రోజులు మానవసేవచేయాలని మనసుమారేసరికి ఆరునెలలు పట్టింది.'

'మీ బాటిల్‌లో యింకా మంచినీళ్లున్నాయా?'

'సారీ! లేవు'

'సరే చెప్పండి'

'నాతో తెచ్చిన పుస్తకాలపార్సెలు విప్పి, వాటిని అలమరాలో సర్దుతుంటే, ఒక డైరీ ఫోల్డరులో మెడికల్ రిపోర్టు కనిపించింది.'

'ఏం రిపోర్టది.'

'మా అమ్మాయి అవమనానికి గురికాకముందు లేడీ డాక్టరు నెత్తురు తీసి పరీక్షకు బొంబాయి పంపించారు. దాని రిపోర్టది. ఆరోజు పురిటికేసులో డాక్టరుగారు ఆలిసిపోయి ఉండడంచేత రిపోర్టు పట్టుకొని నన్నుమళ్లారమ్మన్నారు. కాని...

'ఇప్పుడా రిపోర్టు సంగతి దేనికి?'

'ఆరిపోర్టు చూడగానే నాకు ముచ్చెమటలు పోశాయి. లోకంలో కుర్రాళ్లు తెలిసో తెలియకో తప్పులుచేస్తారు. ప్రతీకొత్త రోగానికి మందులు కనిపెడుతున్నారు. ఈ సంగతి పడుచువాళ్లకు ముందుగా చేప్తే....'

'ఏమిటా సంగతి.'

'ఈ వ్యాధి సాధారణంగా అంటువ్యాధి కాదంటారు. రక్తం మార్పిడి ద్వారానో, లేక...'

'చెప్పవయ్యా, చెప్పు!'

'యౌవనమదంలో కుర్రాళ్లు సామూహిక మానభంగం, అంటే గాంగ్ రేప్ చేశారు. వాళ్లెవరేనా నీకు తెలిస్తే ఈ సంగతి చెప్పు.'

'ఈ సంగతంటే?'

'మా అమ్మయి రక్తం హెచ్‌ఐవి పాజిటివ్ అని రిపోర్టులో వచ్చింది.'

ఆ మాటకు శంకర్ విశ్చేష్టుడయాడు, ప్రపంచమంతా చీకటి కమ్మినట్లయింది అతనికి.

పట్టణంవేపు వెళ్లిన కుర్రాడు తిరిగివచ్చి. మోటారు సైకిలు గేటు దగ్గిర ఆపి శంకర్‌ని పిలుస్తున్నాడు.

శంకర్ లేవలేకపోయాడు. మహాప్రయత్నంచేసి గేటుదాటి రోడ్డుమీదికి వెళ్లాడు. వెనుకసీటు మీద కూర్చోడం చాల కష్టమయింది. తరువాత ఆయిద్దరు కుర్రాళ్లు ఏంమాట్లాడుకున్నారో. ఒక ఫర్లాంగు దూరం కూడా వాహనం మీద పోలేకపోయారు. మరో యిద్దరు మోటారు సైకిలు మీద వచ్చి వాళ్లని కలుసుకొని మాట్లాడుకున్నారు. వాళ్లు కూడా మోటారు సైకిలు నడపలేకపోయారు. వాహనాలు రోడ్డు పక్కపడేశారు.

నలుగురూ, పడుతూలేస్తూ, ఫారమ్ హౌసుల వేపు పరుగెడుతున్నారు, ఎవరో దేవత తనబడిలోకి వాళ్లను పిలుస్తున్నట్లు.